# జ్ఞాన పథం

## అంతర్యామి

మానవుడు రాయిని చెక్కి, దాన్ని అందమైన శిల్పంగా మారుస్తాడు. సరిగమల్ని కూర్చి విన సొంపైన రాగం ఆలపిస్తాడు. రంగుల్ని కళ్లకు ఇంపుగా రంగరించి, సుందర చిత్రాన్ని ఆవిష్కరిస్తాడు. అబ్బురపరచేలా పూలతోటను తీర్చిదిద్దుతాడు. ప్రకృతిలోని అణువణువునూ నేత్రపర్వంగా మలచాలని ఆరాటపడతాడు.

ప్రకృతి అంటే చెట్టుచేమలు, జీవ జంతుజాలం అనుకుంటాడు మనిషి. తానూ ప్రకృతిలో ఓ భాగం అనుకోడు. తనను తాను తీర్చిదిద్దుకోవడం, ఉన్నత వ్యక్తిత్వంతో వెలిగిపోవడం మనిషితనానికి ముఖ్యం. వేద, పురాణ, ఇతిహాసాలు ఎన్నో ఏళ్ల కిందట అతడి వ్యక్తిత్వానికి నగిషీలు చెక్కాయి. మానవుడు వాటిలోని సారం గ్రహించి, ఆచరణీయం చేసుకుంటే విజయావకాశాలు మెరుగుపడతాయి.

శ్రీరాముడు సకల సుగుణాభిరాముడు. మహోన్నతమైన సుగుణాలు ఆరు. మనిషికి గుర్తింపు ఇచ్చేది జ్ఞానం. అదే తేజస్సు. నిరంతరం జ్ఞాన సముపార్జన కోసం అతడు తపించిపోవాలి. ఆలోచనలకు రూపమివ్వాలి. పరాక్రమం లేకపోతే మనిషి మనలేడు. దానవుల దుర్మార్గాన్ని విష్ణుమూర్తి అవతార పరాక్రమం దునుమాడింది. మానసిక, శారీరక బలాలతో కూడిన ఆత్మబలం ప్రతి వ్యక్తికీ ఉండి తీరాలి. మనిషికి ఆత్మబలం వల్ల తన మీద తనకు నమ్మకం కలుగుతుంది. కొండను పిండి చేయాలన్నా, ఎత్తైన కొండను ఎక్కి ఆకాశాన్ని చుంబించాలన్నా, అనితర సాధ్యాలు తన పేరిట నమోదు చేసుకోవాలనుకున్నా ఆత్మబలమే ప్రధానం.

ఏ అంశమైనా, మానవుడు అందులో రాణించాలంటే తగిన సామర్థ్యం ఉండాలి. నిరంతర సాధన, అభ్యాసంతోనే అది సాధ్యమవుతుంది. మనిషికి కొన్ని కారణాల వల్ల కోపం రావడం సహజం. అది తాటాకు మంటలా చప్పున చల్లారిపోవాలి. మితిమీరకూడదు. సహనం అతడికి ఆభరణం. సహనశీలిని లోకం ప్రత్యేకంగా చూస్తుంది. కలిసి నడుద్దాం, మాట్లాడదాం; చక్కటి మార్గంలో ప్రయాణిద్దాం, నలుగురితో పాటు మనుగడ సాగిద్దామని రుగ్వేదం బోధిస్తుంది. దోషం లేని కర్మ ఆచరణీయమని యజుర్వేదం తెలియజేస్తుంది. ఈర్ష్యగలవాడు మరణించినవాడితో సమానం-అంటుంది అధర్వణ వేదం. అసూయ, ద్వేషం విడనాడిన మనిషి సాక్షాత్తు దైవ సమానుడే అంటాయి శాస్త్రాలు. ప్రతి మనిషీ కృతజ్ఞత కలిగి ఉండాలి. ఇతరులు తనకు చేసిన మేలును మరవకపోవడం కృతజ్ఞత. జీవితంలో ఎంతోమంది తారసపడతారు. ఎన్నో సహాయాలు చేస్తారు. వారిని గుర్తుంచుకోవడమే కాదు, అవసరం కలిగినప్పుడు సహాయం చేయడంలోనూ మానవుడు ముందుండాలి.



కృతజ్ఞతను ధర్మశాస్త్రాలు యజ్ఞ సమానంగా భావిస్తాయి ఇది అయిదు విధాలు. జన్మనిచ్చి, ఉదర పోషణార్థం అనేక వనరులు ప్రసాదించిన భగవంతుడి పట్ల కనబరచే మొదటి కృతజ్ఞత దేవయజ్ఞం. కని, పెంచిన తల్లిదండ్రులిద్దరిపట్ల చూపించే కృతజ్ఞత పితృయజ్ఞం. మానవ మనుగడకు అవసరమైన వాటిని వేద పురాణేతిహాసాల ద్వారా అందించారు రుషులు. సత్యం, ధర్మం, న్యాయం వంటి కట్టుబాట్లతో ఒక చక్కటి వ్యవస్థ ఏర్పడటానికి రుషులే కారణం. ఆ కృతజ్ఞతే రుషియజ్ఞం. సాటివారి పట్ల మానవతా దృక్పథంతో మెలగడం, సహాయ సహకారాలు అందించడం మనుష్య యజ్ఞం కిందకు వస్తాయి. ప్రకృతిలోని సమస్త జీవరాశినీ కనిపెట్టుకుని ఉండి, ప్రేమభావంతో ఆదరించే కృతజ్ఞతను భూతయజ్ఞంగా చెబుతారు.

మానవీయ విలువలకు పట్టం కడుతూ; పురాణ వాఙ్మయం, ఆచారాలు, కట్టుబాటు వ్యవహారాలతో మన పూర్వీకులు జ్ఞానపథం చూపించారు. దాన్ని అనుసరిస్తే, మానవుడికి గమ్యం స్పష్టంగా గోచరిస్తుంది!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు